క్లుప్తంగా

మహంకాళి దేవస్థానంలో చండి హోమం



దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో శనివారం చండి హోమం నిర్వహించారు. అమావాస్య సందర్భంగా కోనేరు కుటుంబరావు, హిమబిందు దంపతులు, వేగే జయ కృష్ణ దంపతులు హోమంలో పాల్గొన్నారు. భక్తులకు ఏర్పాట్లను దేవస్థాన ఈఓ కె.సునీల్ కుమార్ పర్యవేక్షించారు.

క్రెడిట్ క్యాంపునకు విశేష స్పందన



దుగ్గిరాల: కార్పొరేషన్ రుణాలకు భారీగా లబ్ధిదారులు హాజరయ్యారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం క్రెడిట్ క్యాంపు నిర్వహించారు. ఎంపీడీఓ. ఎ.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. క్యాంపునకు 350 మంది లబ్ధిదారులు హాజరయ్యారని, మొత్తం 90 యూనిట్లు ఉన్నాయని చెప్పారు. బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు, సెలక్షన్ కమిటీ సభ్యులు, ఆఫీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు అన్నదానం



దాచేపల్లి: నారాయణపురంలోని ఫాతిమా మాత విభిన్న ప్రతిభవంతుల పాఠశాలలో మానసిక దివ్యాంగులకు వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం అన్నదానం చేశారు. పొందుగల సర్పంచ్ షేక్ ఇమామ్‌వలి ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ పండగ సందర్భంగా పాఠశాలను సందర్శించారు. పాఠశాల అభివృద్ధికి తొడ్పాటు అందిస్తామని చెప్పారు. పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, నగర పంచాయతీ వైస్ చైర్మన్ షేక్ ఖాదర్‌భాషా, ఎంపీటీసీ ఆకూరి వెంకటరెడ్డి, నాయకులు ఆవుల సైదులు, ముడి విక్టర్‌పాల్, జంగాల సింగరయ్యయాదవ్ పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద ఉన్న పాత రైల్వే క్వార్టర్స్‌లో గుర్తుతెలియని వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వెళ్లి తాడుకు వేళాడుతున్న వ్యక్తి మృతదేహాన్ని కిందకు దింపి, పరిశీలించారు. అప్పటికే ఆ మృత దేహం కుళ్లిపోయి ఉంది. బట్టలు సైతం నీరుకారడంతో గుర్తించడం చాలా కష్టంగా ఉందని, మృతి చెంది రెండు మూడు వారాలు అయ్యి ఉండవచ్చని ఆయన తెలిపారు. ఎక్కడైనా మిస్సింగ్ కేసుల విషయాలను సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యంకు అవార్డు



డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యం

తెనాలి: కెనడా దేశానికి చెందిన ప్రముఖ సంఘ సేవకురాలు షారోన్ పేరిట ఏటా అందిస్తున్న 'షారోన్ స్మారక అంతర్జాతీయ సేవ అవార్డ్' 2025 సంవత్సరానికి ప్రముఖ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యంకు ప్రదానం చేయనున్నారు. పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ ప్రదీప్ దోనేపూడి శనివారం సాయంత్రం రూరల్ మండల గ్రామం పెదరావూరులోని సంస్థ కార్యాలయంలో వివరాలను తెలియజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిగా ఎన్నో క్లిష్టతరమైన ఆపరేషన్లను చేసిన డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా 2000 సంవత్సరంలో పదవీ విరమణ చేశారని తెలిపారు. పెన్నీ మినిస్ట్రీస్ ఇండియా ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సేవాసంస్థ తరపున ప్రతిభావంతులైన సేవానిరతిగల ప్రముఖులను జ్యూరీ ఎంపిక చేసి ప్రతిఏడాది 'షారోన్ అంతర్జాతీయ సేవా అవార్డు'తో సత్కరిస్తోందని ప్రదీప్ తెలిపారు. ఇంతకుముందు డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ డి.శారద, చర్మవ్యాధుల నిపుణురాలు డాక్టర్ యశోధరకుఈ అవార్డును బహూకరించామని గుర్తుచేశారు. త్వరలో తెనాలిలో ఏర్పాటుచేసే ప్రత్యేక సభలో డాక్టర్ సుబ్రహ్మణ్యంకు అవార్డును ప్రదానం చేస్తామని వివరించారు.

సీఎం సభా ఏర్పాట్ల పరిశీలన



సీఎం పర్యటన సభా వేదిక వద్ద పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ నాగలక్ష్మి

వెలగపూడి(తాడికొండ): తుళ్ళూరు మండలం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం సమీపంలో పీ-4 విధానాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను శనివారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఇతర అధికారులతో కలిసి పర్యటించారు. సభాస్థలి ఏర్పాట్లు బ్యారికేడ్లు, వాహనాల పార్కింగ్, సీటింగ్ తదితర ఏర్పాట్లపై అధికారులతో చర్చించి, సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తాగునీరు అందుబాటులో ఉంచాలని, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేపట్టడంతో పాటు అధికారులు తమకు కేటాయించిన విధులు పాటించి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారి వెంట రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ఐజీ ఎం హరినారాయణ, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి ప్రద్యుమ్న, వీసీ అండ్ ఎండీ అభిషేక్ కిషోర్, ఐఅండ్‌సీ కార్యదర్శి యువరాజ్, ఏపీఐఐసీ ఈడీ పనబాక రచనా, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, ఆర్డీవో కె శ్రీనివాసరావు, డ్వామా పీడీ శంకర్, డీపీవో నాగ సాయి కుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ వెంకటేశ్వర్లు తదితర అధికారులున్నారు.

ఫిర్యాదు చేసే హక్కు కూడా లేదా?

వైఎస్సార్ సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నారాయణమూర్తి



తాడేపల్లిలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అంకిరెడ్డి నాగ నారాయణమూర్తి తదితరులు

తాడేపల్లి రూరల్ : మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు, ఇతర నాయకులపై సోషల్ మీడియాలో కొంతమంది అసత్య ప్రచారాలు, మార్ఫింగ్ చేసి ఫొటోలు పెడుతుంటే ఫిర్యాదు చేస్తే ఓ టీవీ చానల్ (సాక్షి కాదు)లో డిబేట్ నిర్వహించడం చాలా దారుణమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అంకిరెడ్డి నాగ నారాయణమూర్తి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి కొడాలి నాని, సజ్జల రామకృష్ణారెడ్డి, భార్గవ్‌లతో పాటు కొంతమంది ఫొటోలను మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో విష ప్రచారం చేస్తున్నవారిపై శనివారం గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ టీడీపీ, జనసేన వారికి మాత్రమే మనోభావాలు ఉంటాయా అని ప్రశ్నించారు. వారు ఫిర్యాదు చేస్తే వెంటనే పోలీసులు అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, ఇతర మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలపై మార్ఫింగ్ చేసిన ఫొటోలను పెడితే కేసు పెడితే..కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఒక టీవీ చానల్‌లో ప్రత్యేకంగా నలుగురిని కూర్చోబెట్టి, అందులో అవమానిస్తూ గంటన్నరపాటు చర్చించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ వెంకట నారాయణ రెడ్డి, రాష్ట్ర బూత్ కన్వీనర్ల అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర బొందాలి సంఘం అధ్యక్షులు బొందాలి నరేంద్ర సింగ్, రాష్ట్ర ఎస్సీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరు కనకారావు, గంజి షణ్ముఖ, ఓబుల రెడ్డి, నరేంద్రరెడ్డి, రమణ, బోయిన బ్రహ్మయ్య యాదవ్, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

తాడికొండ: వచ్చే విద్యా సంవత్సరానికి ఏపీ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి ప్రవేశానికి, 6, 7, 8 తరగతుల ఖాళీల భర్తీ, ఇంటర్ ప్రథమ, డిగ్రీ ప్రథమ ఏడాది ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తాడికొండ ఏపీ గురుకుల ఎక్సలెన్స్ సెంటర్ ప్రిన్సిపల్ ఎం.జోగారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఏపీఆర్ఎస్ క్యాట్ - 2025, ఏపీఆర్‌జేసీ మరియు డీసీ సెట్-2025 పరీక్షల కోసం ఏపీఆర్ఎస్ డాట్ ఏపీసీఎఫ్ఎస్ఎస్ డాట్ ఇన్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు చేయాలని సూచించారు.

పరిశుద్ధ సమాజ కూడికలు

తెనాలిఅర్బన్: ఫిలదెల్ఫియా ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ఏప్రిల్ 13, 14, 15 తేదీల్లో పరిశుద్ధ సమాజ కూడికలు నిర్వహించనున్నట్లు పాస్టర్ సిహెచ్ నతానియేల్ తెలిపారు. మారీసుపేట రెండు గేట్ల మధ్యలోని కొలకలూరి మత్తయ్య హాస్టల్ ఆవరణలో ప్రతిరోజు రాత్రి ఏడు గంటలకు కూడికలు జరుగుతాయని చెప్పారు. రెవరెండ్ డేవిడ్ బ్రెన్‌హాం వాక్యపరిచర్య చేస్తారని పేర్కొన్నారు. అందరూ పాల్గొనాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



కాలువల్లో మందు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఫిరంగిపురం: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని వైద్యురాలు శ్వేత అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శ ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి ఆరోగ్య సిబ్బంది వెళ్లి పరిసరాల శుభ్రత గురించి వివరించారు. వేసవిలో నీటిని నిల్వ ఉంచుకోకుండా నాలుగు రోజులకోమారు కుండల్లో, గాబుల్లో నీటిని శుభ్రంగా కడిగి మార్చుకోవాలని చెప్పారు. మురుగు కాలువల్లో నీరు సక్రమంగా పారేలా చూసుకోవాలని, లేదా పంచాయతీ సిబ్బందికి తెలియజేయాలన్నారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, వడదెబ్బ తగిలిన వారు ఓఆర్ఎస్ ప్యాకెటు నీటిని తాగాలని తగ్గనిచో వైద్యశాలలో సంప్రదించాలని చెప్పారు.

బీజేపీని బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

గుంటూరు మెడికల్: సంస్థాగతంగా బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు పేర్కొన్నారు. మంగళగిరి పట్టణ బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా చెరుకూరు తిరుపతిరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్‌లో బీజేపీ కమిటీ ఉండాలని, మండల కమిటీ సమర్థవంతంగా పని చేసి, పురపాలక ఎన్నికల్లో కౌన్సిలర్లుగా గెలిచి బీజేపీ జెండా ఎగరవేయాలన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి బలంగా ఉందన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలందరికీ పథకాలన్నీ అందే విధంగా పట్టణ కమిటీ, అన్నీ బూత్ కమిటీ అధ్యక్షులు పనిచేయాలని అన్నారు. అసెంబ్లీ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శులు వై.వి.సుబ్బారావు, చరకా కుమార్ గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు కొత్తూరు సుబ్బారావు, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండా నవనీత్ కృష్ణారెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు తుల్లిమిల్లి రామకృష్ణ, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు తుల్లిమిల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు కోవెల కారు రాకేష్ జీ, పట్టణ ప్రధాన కార్యదర్శి కమల కృష్ణ, మొండి వీరబాబు, మాజీ పట్టణ అధ్యక్షుడు కాండ్రు భాను, కిషోర్ పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి మాదిగలకు కేటాయించాలి



మంగళగిరి టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో కేవలం ఎస్సీ కమిషన్‌ను మాలలకే కేటాయించారని, ఇప్పటికైనా మాదిగ సామాజిక వర్గానికి ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని కోరారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి చేపట్టడానికి మాదిగలు అర్హులు కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా బలమైన ఉద్యమాలు నడిపిన చరిత్ర ఎమ్మార్పీస్ అని ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి మాదిగలకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

రహదారి పనులు వేగవంతం చేయండి

ఎంపీపీ భీమవరపు పద్మావతి



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: మండల పరిధిలోని ప్రధాన రహదారుల మరమ్మతులు, వివిధ రంగాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలను అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఈవోపీఆర్డీ భార్గవ్ ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ ఏఈ నరసింహారావు మాట్లాడుతూ నందివెలుగు నుండి కొల్లిపర వరకు వచ్చే రోడ్డు, అత్తోట నుండి దంతలూరు, కుంచవరం రోడ్డు ప్యాచ్ వర్క్‌లు మొదలుపెట్టినట్లు తెలిపారు. అదే విధంగా మున్నంగి నుండి దుగ్గిరాల రోడ్డు నిర్మాణం కొరకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. మండల వ్యవసాయాధికారి కె.వెంకటరావు మాట్లాడుతూ రైతులకు సీజనల్ పంటల సాగులో ఎటువంటి మెళకువలు తీసుకువాలనే అంశాలను వివరించారు. ఏపీఎం పి. రమాదేవి మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా రైతులు పంట రుణాలు ఏ విధంగా పొందాలి, వాటిని ఏ విధంగా చెల్లించాలి అనే అంశాలను వివరించారు. అనంతరం బడ్జెట్ ప్రతిపాదనలు ఆమోదించారు. సమావేశంలో మండల పరిషత్ ఉప-అధ్యక్షు లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, కొల్లిపర మండల పరిషత్ ఏవో ప్రతాపరెడ్డి, తహశీల్దార్ కార్యాలయ డీటీ రాజేష్, కొల్లిపర మెడికల్ అధికారి డాక్టర్ బి.భారత్, మున్నంగి పీహెచ్‌సీ డాక్టర్ సుబ్బారావు, ఎంఈవో ఝాన్సీలత, ఏఈ పీఆర్ సాంబిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ సుధాకర్, ఎలక్ట్రికల్ ఏఈ, పాల్గొన్నారు.

కేఎల్‌యూలో టెక్నో ఎక్స్‌పో-2025




ఐఓటీ టెక్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు

తాడేపల్లి రూరల్ : జాతీయ స్థాయి టెక్నో ఎక్స్-2025ను వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు మాట్లాడుతూ భవిష్యత్తులో భావి శాస్త్రవేత్తలుగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. సైన్స్ నిత్య జీవితంలో ఒక భాగమని, సైన్స్ లేనిదే ఏదీ లేదన్నారు. ప్రతి ఒక్క అంశం సైన్స్‌తో ముడిపడి ఉంటుందన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ యూనివర్శిటీలకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులు 200కు పైగా ప్రదర్శనలు చేయడం అభినందనీయమన్నారు. ఐఓటీ విభాగాధిపతి డాక్టర్ పి. సత్యనారాయణ మాట్లాడుతూ తమ విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలు కనుగొని, నూతన టెక్నాలజీకి శ్రీకారం చుట్టి ప్రదర్శించారని వివరించారు. జాతీయ స్థాయిలో 24 గంటల పాటు జరిగిన హాక్‌థాన్‌లో దేశవ్యాప్తంగా ఉన్న పలు విశ్వవిద్యాలయాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని తాము రూపొందించిన టెక్నాలజీ పరికరాలను ప్రదర్శించారని వివరించారు. వర్శిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఎవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖర రావు, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, ఐఓటీ విభాగాధిపతి డాక్టర్ పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఈత పోటీలు

తాడేపల్లి రూరల్ : కేఎల్ యూనివర్శిటీలో శనివారం జాతీయస్థాయి ఈత పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అంతర్జాతీయ ఈతకారిణి గోలి శ్యామల, మాదల భరత్‌కుమార్ విచ్చేసి ఈత పోటీలను ప్రారంభించారు. కేఎల్‌యూ విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ..100 మీటర్ల ఫ్రీస్టైల్ పురుషుల విభాగంలో జి. సంపత్‌కుమార్ ప్రథమ, నిహార్ ద్వితీయ, శరణ్ తృతీయ, బ్యాక్‌స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్ 100 మీటర్ల పురుషుల విభాగంలో నిహార్ ప్రథమ స్థానం, బటర్‌ఫ్లై 100 మీటర్ల పురుషుల విభాగంలో శరణ్ ప్రథమ స్థానం, ఫ్రీ స్టైల్ రిలే 400 మీటర్ల బాలికల విభాగంలో రక్షణ ప్రథమ స్థానం, పురుషుల విభాగంలో ఎం.శివహరి, టి.మోనిష్ కుమార్, కె. జయసూర్య, కె.శరణ్‌లు ప్రథమ స్థానాల్లో నిలిచారని తెలిపారు. కేఎల్‌యూ నుంచి సాయి నిహార్, కె.కె. జార్జ్, పి. కౌషిక్ ఆదిత్య, డి.గిరీష్‌లు ద్వితీయ స్థానంలోను, వీఐటీ చెన్నై నుంచి సర్వేపల్లి కృష్ణ ప్రణవ్, నిర్మల్ కుమార్, బీఎస్ దేవ్‌దర్శన్, మానస్ ఇండోర్‌లు తృతీయ స్థానం దక్కించుకున్నారని తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయబహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు అందజేశామని వివరించారు.

మణిపాల్‌లో స్ట్రోగెన్స్ సింద్రోమ్ చికిత్స విజయవంతం



స్ట్రోగెన్స్ సింద్రోమ్ నమూనా

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు ప్రాంతంలో ఉన్న మణిపాల్ హాస్పిటల్ వైద్యులు మెదడును ప్రభావితం చేసే స్ట్రోగెన్స్ సింద్రోమ్ కేసును విజయవంతంగా గుర్తించి చికిత్స చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ తమ హాస్పిటల్‌కు ఒక యువకుడు జ్వరం, తీవ్రమైన తలనొప్పితో వచ్చాడని తెలిపారు. సాధారణ అంటువ్యాధులకు చికిత్స ప్రారంభించినప్పటికీ, అతని ఆరోగ్య పరిస్థితి సరిగా ఉండని కారణంగా మరిన్ని పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. లాలాజల గ్రంధుల నుంచి తీసిన బయాప్సీ ద్వారా రోగ నిర్ధారణ జరిగిందని తెలిపారు. మణిపాల్ హాస్పిటల్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ వంశీ చలసాని మాట్లాడుతూ స్ట్రోగెన్స్ సింద్రోమ్ కారణంగా కళ్లు, నోటిని మాత్రమే ప్రభావితం చేస్తుందని భావిస్తారని, కానీ ఇది మెదడును కూడా ప్రభావితం చేయడం ద్వారా తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుందని అన్నారు. రోగిని స్టెరాయిడ్ చికిత్స ప్రారంభించిన తర్వాత అతని రోగ్య పరిస్థితి మెరుగుపడిందని, రోగనిరోధక వ్యవస్థను నియంత్రించడానికి దీర్ఘకాలిక మందులు వాడాలని సూచించామని తెలిపారు. ఆ యువకుడికి జీవితంలో రెండవ అవకాశం కల్పించగలిగామని అన్నారు.

ముందస్తు ఉగాది వేడుకలు



ఫిరంగిపురం: వేమవరం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో శనివారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం దివి కమల్‌మోహన్ మాట్లాడుతూ జీవితంలో కష్ట సుఖాలను సమానంగా స్వీకరించే విధానాన్ని ఉగాది పచ్చడి తెలియజేస్తుందని చెప్పారు. ఉగాది పచ్చడి విశిష్టతను వివరించారు. విద్యార్థులు పలు వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ జెట్టి సుబ్బయ్య, ఉపాధ్యాయుడు శేషు రవికుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర నాయక్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘం నేతల హర్షం

దుగ్గిరాల: జీపీఎఫ్ నిదులు విడుదల చేయటంపై ఉద్యోగ సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. దుగ్గిరాల ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉద్యోగ సంఘం మండల నాయకులు అందె బాల చంద్రమౌళి సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయి మొత్తం రూ.7,300 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఎంపీపీ జబీన్, ఎంపీడీఓ శ్రీనివాస రావు, జి.పూర్ణప్రసాద్. టీడీపీ సీనియర్ నాయకులు మురళీ కృష్ణ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగికి ఉగాది పురస్కారం



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో నివాసముండే బీఎస్ఎన్ఎస్ విశ్రాంత ఉద్యోగికి ఉగాది పురస్కారాలలో భాగంగా ఘనంగా సన్మానించారు. శనివారం పలువురు ఉద్యోగస్తులకు ఆయనకు అభినందనలు తెలియజేశారు. విజయవాడ గాంధీ నగర్‌లో ఉగాది పండుగ సందర్భంగా విజయశ్రీ సాంస్కృతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉండవల్లికి చెందిన విశ్రాంత ఉద్యోగి మున్నంగి జస్వంత్‌రెడ్డి, సరోజని దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సేవా సంస్థ అధ్యక్షులు బండారు నరసింహారావు మాట్లాడుతూ జస్వంత్‌రెడ్డి సేవలను గుర్తించి ఉగాది పండుగ సందర్భంగా ఈ పురస్కారం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయశ్రీ సాంస్కృతి సేవ సంస్థ నిర్వాహకులు, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



తాడేపల్లి రూరల్ : ఉండవల్లి సెంటర్ నాలుగు రోడ్ల కూడలిలో బాలాజీ చికెన్ సెంటర్ గరిక బాలాజీ జ్ఞాపకార్థం కుమారులు గరిక దుర్గారావు, సూరిబాబు, గోపి మజ్జిగ చలివేంద్ర శనివారం ఏర్పాటు చేశారు. ఏడేళ్ల నుంచి వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

పేదలకు దుస్తులు పంపిణీ



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని జెండా చెట్టు సెంటర్లో శనివారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవో మహ్మద్ అలీ పేద ముస్లింలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా రంజాన్ సందర్భంగా పేద ముస్లింలకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని మసీదును పరిశీలించారు. ఆయన వెంట వక్ఫ్‌బోర్డు సభ్యులు షేక్.జహంగీర్, రబ్బానీ, సుబానీ, గ్రామ ముస్లిం నాయకులు పాల్గొన్నారు.